ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 13 అక్టోబరు 2025 | 5





మార్గదర్శులు.. ఉపాధ్యాయులు



కడియం,అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ద్వారానే ఉత్తమ సమాజం తయారవుతుందని..భవిష్యత్ మార్గదర్శులు ఉపాధ్యాయులేనని డీఈవో కె.వాసుదేవ రావు,అడిషనల్ ఎస్పీ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్,వరదా ఫౌండేషన్ ఆర్గనైజర్ వరదా సుబ్బారావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లో మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపా ధ్యాయులు, రాష్ట్ర,జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు 40 మందిని సత్కరించారు.డీఎస్సీలో ద్వితీయ స్థానంలో నిలిచిన వెలుగుబంటి అన్నపూర్ణను అభినందించారు.

గోవిందా హరి గోవిందా!

గోవిందా హరి గోవిందా.. గోకులనందన గోవిందా అంటూ కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామిని భక్తజనం కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం బ్రహ్మాండంగా నిర్వహించారు. ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారు కోదండరామ అలంకృతుడై హనుమద్వాహనంపై తిరువీధుల్లో విహరించారు. అశేష భక్తజనం వాహన సేవలో పాల్గొని తన్మయత్వం పొందారు. 7



రాయవరంలో ఈ నెల 8న దగ్ధమైన బాణసంచా తయారీ కేంద్రం

బాధితుల ఫైర్!

పరిహారానికి డిమాండ్

- రాయవరంలో ప్రమాదం
- 10కి చేరిన మృతుల సంఖ్య
- నేటికీ బాధితులకు అందని సాయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరంలో ఈ నెల 8న జరిగిన బాణసంచా భారీ విస్ఫోటనంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. నాటి ఘటనలో సంఘటనా స్థలంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. నలుగురు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక్కొక్కరిగా మృత్యువాత పడ్డారు. దీంతో ఆదివారం నాటికి బాణసంచా మృతుల సంఖ్య పదికి చేరింది. మొత్తం మృతుల్లో ఒకరు ఒడిశా ప్రాంతానికి చెందినవారు కాగా మరొకరు శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు ఉన్నారు.మిగిలిన 8 మందిలో అనపర్తి, పెదపూడి, రాయవరం ప్రాంతాలకు చెందిన మహిళా కూలీలు ఉన్నారు. దినసరి కార్మికులుగా పనిచేస్తూ జీవనం గడుపుకుంటున్నారు. వీరికి అటు ప్రభుత్వం తరఫున గానీ, ఇటు ఫైర్‌వర్క్స్ యాజమాన్యం తరఫున గానీ ఎటువంటి సహాయం అందలేదు. యాజమాన్య సంస్థ కార్మికుల పేరిట బీమా వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో మృతుల కుటుంబాలవారు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వ పరంగా తమ కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లతో పాటు ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వెళ్లినప్పుడు తమ కుటుంబాలను ఆదుకోవాలంటూ వేడుకోలు చేసుకున్నారు. ప్రభుత్వం రాయవరం ఘటనపై విచారణ కమిటీని నియమించిందని..ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రభుత్వం ప్రకటిస్తుందనే సమాచారాన్ని ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబీకులకు చెబుతున్నారు. పది మంది కుటుంబీకులకు ప్రభుత్వం నుంచి తక్షణసాయం అందించి ఆదుకోవాలంటూ ఇప్పటికే ప్రజాసంఘాలు వారి పక్షాన నిలబడి ఆందోళన చేపట్టాయి. ఇదే డిమాండ్‌ను స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి బాధిత కుటుంబీకులు తీసుకువెళ్లారు. తమకు న్యాయం చేయాలని బాధితులంతా ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కోరుతున్నారు.

గురువులు.. కొత్త కొలువులు!



రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కొత్త టీచర్లు(ఫైల్)

- నేటి నుంచి స్కూళ్లకు కొత్త మాస్టార్లు
- మెగా డీఎస్సీ-2025 ద్వారా ఎంపిక
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీల భర్తీ
- మాట నిలుపుకున్న కూటమి సర్కారు
- నూతన ఉపాధ్యాయుల ఆనందం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అంతా అనుకున్నట్టే జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేసింది. కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేయడంతో పాటు పోస్టింగ్ ఉత్తర్వులూ అందించింది.దీంతో నూతనోపాధ్యాయులు సోమవారం నుంచి బడి బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. పాఠాలు చెప్పే పనిలో బిజీబిజీగా అవనున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం జనవరిలో మరో డీఎస్సీ నిర్వహణకు సిద్ధమవుతోంది.మరో మూడు వేల పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తోంది.

టీచర్ల కొరత తీరింది..

కూటమి ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల కొరత తీర్చింది.మెగా డీఎస్సీ-2025 ద్వారా ఖాళీలను భర్తీ చేసింది. ఎంపికైన కొత్త గురువులు ఇప్పటికే ఎనిమిది రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు.అనంతరం ఉపా ధ్యాయుల వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రకటించారు. వారికి కావాల్సిన స్థానాన్ని ఎంపిక చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. శనివారం నూతనోపాధ్యాయులు ఎంచుకున్న స్థానాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు ఈ నెల 11వ తేదీన అభ్యర్థుల మొబైల్‌లోని లీప్ యాప్‌కు పంపారు. పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు అందరూ విద్యాశాఖాధికారులు సూచించిన అన్ని రకాల విద్యార్హతలు,కులం, ఆధార్, పాన్ కార్డు తదితర వాటిని తీసుకుని వారికి పోస్టింగ్ ఉత్తర్వుల్లో పేర్కొన్న పాఠశాలలకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారులు సూచించారు. కొత్త కొలువులో చేరేందుకు నూతనోపాధ్యాయులు సమాయత్తమవుతున్నారు.కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో మెగా డీఎస్సీ ద్వారా భారీగా ఉపా ధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారమే వేలాదిగా పోస్టులను భర్తీ చేసింది. ఉపాధ్యాయ వృత్తిలో తమను భాగస్వాములుగా చేసిందని 'కొత్త టీచర్లు' హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1693 పోస్టులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధి మెగా డీఎస్సీ-2025లో 1,241 పోస్టులకు 63,004 దరఖాస్తులు వచ్చాయి. 38,617 మంది పరీక్షలకు హాజరయ్యారు.ఎస్‌జీటీ 423, స్కూల్ అసిస్టెంట్ 818 ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ వి.భాగంలో ఎస్ఏ (పీఎస్) 3, ఎస్ఏ (బీఎస్) 4, ఎస్ఏ(పీఈ) 1,ఎస్‌జీటీ 104 ఖాళీగా ఉన్నాయి. జోన్-2 పరిధిలో ఏపీ రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ సోషల్ వెల్ఫేర్, టీసీ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/ట్రైబల్ (గురుకులం) యాజమాన్య పాఠశాలల్లో 348 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీటీ 24 పోస్టులు భర్తీ చేసేలా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.ఈ పోస్టులన్నింటికీ ఈ ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇచ్చింది.జూన్, జూలై నెలలో మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహించా రు.ఆగస్టులో కీ, ఫైనల్ ఫలితాలు వెల్లడయ్యాయి. ధ్రువపత్రాల పరిశీలన ఆగస్టు 28 నుంచి ఏడు దశల్లో జరిగింది. ఉద్యోగ నియామకపత్రాలు సెప్టెంబరు 25న అమరావతిలో అందజేశారు. అక్టోబరు మూడు నుంచి పదో తేదీ వరకు పలు కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు. వృత్తిలో పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాలు వివరించారు.విద్యాశాఖ విధివిధానాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

15 నుంచి విద్యుత్ ఉద్యోగుల
నిరవధిక సమ్మె
నేడు ఛలో విజయవాడ

రాజమహేంద్రవరం,అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగులు ఈ నెల 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నారు.దానికి ముందుగా సోమవారం ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు.ఇంజనీర్లు తప్పించి, ఓఅండ్ఎం ఉద్యోగులంతా సమ్మె బాట పడుతున్నారు. 1999 నుంచి 2004 మధ్య విద్యుత్ సంస్థల్లో నియమించిన ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ ఇవ్వాలని, నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని, కాంట్రాక్టు సంస్థలను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 33/11 కేవీ సబ్-స్టేషన్లు కాంట్రాక్టర్లకు అప్పగించకూడదనే తదితర 15 డిమాండ్లతో ఉద్యోగులు సమ్మె బాట పట్టారు.ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అన్ని డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షణ ఇంజనీరు కె.తిలక్‌కుమార్ తెలిపారు.వినియోగదారులు సమస్య ఉంటే కింది నెంబర్లను సంప్రదించాలన్నారు.

కంట్రోల్ రూమ్‌లు

టోల్ ఫ్రీ నంబర్	1912
రాజమహేంద్రవరం	0883-2463354 7382299960

డివిజన్ స్థాయిలో

రాజమహేంద్రవరం టౌన్	94906 10093
రాజమహేంద్రవరం రూరల్	94931 78874
నిడదవోలు	83329 73595
ఎస్ఈ	94408 12583
ఈఈ టెక్నికల్	94408 12584
ఈఈ ఆపరేషన్ టౌన్	94408 12585
ఈఈ ఆపరేషన్ రూరల్	73825 85487
ఈఈ నిడదవోలు	94408 12706

నిధుల.. దారులు!



అభివృద్ధి చేయనున్న గొల్లప్రోలు పరిధిలోని ప్రధాన రహదారి

ఉమ్మడి జిల్లాలో రోడ్లకు రూ 88.25 కోట్లు

- మూడో విడత ఇచ్చేశారు
- ఇప్పటికే రూ.96 కోట్లు విడుదల
- రెండు విడతలుగా కేటాయింపు
- టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- ఆర్అండ్‌బీ శాఖ కసరత్తు
- గుంతల్లేని రహదారులే లక్ష్యం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

రహదారుల అభివృద్ధికి నిధులు పుష్కలంగా విడుదలవుతున్నాయి. గుంతల్లేని రోడ్లు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగంగా ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే రెండు విడతల్లో నిధులు లభించగా, ఇప్పుడు మరో విడత నిధులను కేటాయించారు. టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయిస్తోంది.ఇప్పటికే రహదారులకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు అభివృద్ధి చేశారు.

టెండర్ల ప్రక్రియ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆర్అండ్‌బీ శాఖ ఆధీనంలో ఉన్న రాష్ట్ర, జిల్లా రహదారులు అభివృద్ధికి పలు విడతలుగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లో కేటాయించిన నిధులతో కొన్ని ప్రధాన రోడ్లకు అభివృద్ధి చేశారు. తదనంతరం రెండు విడతలుగా రహదారుల అభివృద్ధికి రూ.96 కోట్లు విడుదల చేశారు. ఈ పనులకు ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇందులో కొన్నింటికి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా మరికొన్ని పరిశీలన దశలో ఉన్నాయి. వీటిని వర్షాలు తగ్గగానే చేపట్టి మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.

మరో విడత నిధులు

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. 108 రాష్ట్ర రహదారులు అభివృద్ధికి రూ.400కోట్లు, 166 ప్రధాన జిల్లా రహదారులకు రూ.600 కోట్లు విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న 25 రాష్ట్ర, జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.88.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కాకినాడ జిల్లాలో 9 రోడ్ల అభివృద్ధికి రూ.35.25 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 10 రోడ్లకు రూ30.15 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో ఆరు రహదారుల అభివృద్ధికి రూ.22.85 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పనులు చేపట్టేందుకుగాను టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కాకినాడ జిల్లాకు ఇలా..

రాష్ట్ర రహదారుల్లో కాకినాడ జిల్లాలోని కాకినాడ-పైన రహదారి అభివృద్ధికి రూ.5 కోట్లు, నరసరాపుపేట-కాట్రావులపల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, తుని-కత్తిపూడి మధ్య అత్యంత అధ్వానంగా ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ. 3.50 కోట్లు కేటాయించగా ప్రధాన జిల్లా రహదారుల్లో ఎర్రకోనేరు-వేమవరం రోడ్డుకు రూ.3.75 కోట్లు, మర్లావ-తిరుపతి-చంద్రమాంపల్లి రోడ్డు, కట్టమూరు-జె.తిమ్మాపురం రోడ్ల అభివృద్ధికి రూ.3.60 కోట్లు,తాళ్లూరు ఎన్‌హెచ్16-యల్లమిల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, సర్పవరం జంక్షన్-లైట్‌హౌస్ రోడ్డుకు రూ.2.80 కోట్లు, అమీనాబాద్-యు.కొత్తపల్లి రోడ్డుకు రూ.4.20 కోట్లు, ఉండూరు బ్రిడ్జి-చేదువాడ-మంజేరు-పటవల రోడ్డుకు రూ.4.50 కోట్లు,గొల్లప్రోలు పట్టణం, చేబ్రోలు గ్రామాల పరిధిలోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.3.90కోట్లు కేటాయించారు.

కోనసీమ జిల్లాలో..

రాష్ట్ర రహదారుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సిరిపల్లి-మునిపల్లి రోడ్డు అభి వృద్ధికి రూ.3.50 కోట్లు, రాజవరం-పొదలాడ రోడ్డుకు రూ.3.90 కోట్లు, మండపేట-దుళ్ల రోడ్డుకు రూ.3.50 కోట్లు,సోమేశ్వరం-రాజానగరం రోడ్డుకు రూ.3.50కోట్లు, శివకోడు-మానేపల్లి రోడ్డుకు రూ.2.10 కోట్లు, ఇదే రోడ్డుకు మరో రూ.2.20 కోట్లు విడుదల చేశారు. ప్రధాన జిల్లా రహదారుల్లో విశ్వేశ్వరపురం-దిండి రోడ్డు, గూడపల్లి-గుబ్బలపాలెం-అడవిపాలెం-కేశనపల్లి రోడ్డు, మామిడికుదురు-అప్పనపల్లి-పాతపట్నం లంక రోడ్ల అభివృద్ధికి రూ.4.8 కోట్లు,మురమళ్ల-ఐ.పోలవరం-ఎదుర్లం క రోడ్డుకు రూ.60 లక్షలు, ముమ్మిడివరం- ఐనాపురం-కాట్రేనికోన రోడ్డుకు రూ.3.9 కోట్లు, ముమ్మిడివరం-ముక్తేశ్వరం రోడ్డుకు రూ.2.15కోట్లు మంజూరయ్యాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం-బొమ్మూరు-కేశవరం రోడ్డు అభివృద్ధికి రూ.3.50కోట్లకు మంజూరు చేశారు. జిల్లా రహదారుల్లో కడియం-జేగురుపాడు, కడియపులంక-పొట్టిలంక-వీరవరం రోడ్ల అభివృద్ధికి రూ.3.20 కోట్లు, కానూరు-గోపవరం, ఎన్‌హెచ్16వీవీ రోడ్డు-ఖండవిల్లి రహదారుల అభివృద్ధికి రూ.4.15 కోట్లు, దువ్వ-తేతలి మునిపల్లె రోడ్డుకు రూ4.15 కోట్లు, గోపాలపురం-కాటకోటేశ్వరం రోడ్డుకు రూ.4.35 కోట్లు, ఎన్‌హై రోడ్డు-కురుకురు-పల్లంట్ల-లక్ష్మీపురం-ఈజీకే రోడ్డుకు రూ.3.50 కోట్లు కేటాయించారు.ఈ నిధులతో వేగంగా రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. పనులకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు.



కొవ్వూరులో విద్యార్థుల సమస్యలు తెలుసు కుంటున్న మంత్రి, ఎమ్మెల్యే ముప్పిడి.. విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ చేస్తున్న మంత్రులు సవిత, నిమ్మల, సుభాష్, ఎమ్మెల్యే వాసు తదితరులు



34 శాతానికి బీసీ రిజర్వేషన్లు

- 226 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో పావలా వడ్డీకే విద్యారుణాలు ఇచ్చే యోచన కూటమి ప్రభుత్వం చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. రాజమహేంద్రవరం త్యాగరాజ భవన్‌లో ఆదివారం రాత్రి 226 మంది శెట్టిబలిజ పదో తరగతి మెరిట్ విద్యార్థులకు గోద్రేజ్ సంస్థ ఎస్ఆర్ ఫండ్స్ నుంచి స్కాలర్‌షిప్స్ పంపిణీ చేసి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంచబోతున్నారని, బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నారని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ అన్న ఎన్‌టీఆర్ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే అటుపై ఏ ముఖ్యమంత్రి దానిని మార్చలేదన్నారు. కానీ జగన్ వచ్చి 24 శాతానికి తగ్గించడం వల్ల ఆ ఐదేళ్లు 16 వేల మంది బీసీలు అవకాశాలు కోల్పోయారన్నారు. కొంతమంది కండువాలు మార్చిన వారు మా పార్టీలోకి వచ్చారని తులసివనంలో గంజాయి మొక్కలైన వారిని ఎట్టిపరిస్థితుల్లో సీఎం చంద్రబాబు ఉపేక్షించరని చెప్పారు.కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గతంలో జగన్ కార్పొరేషన్లు పెట్టి వారి నాయకులకు జీతాలు ఇచ్చుకున్నారు తప్పితే వాటికి నిధులు కేటాయించడం గీత కులాలకు న్యాయం చేయడం వంటివి చేయలేదన్నారు. మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తుందన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ శెట్టిబలిజ విద్యార్థుల మెరిట్ స్కాలర్‌షిప్స్ గోద్రేజ్ సీఎస్ఆర్ ఫండ్స్‌ను ఇప్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రులు,వివిధ కమిటీల చైర్మన్లను శెట్టిబలిజ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. తొలుత వేదికపై జ్యోతిరావు పూలే, దొమ్మేటి వెంకట రెడ్డి తదితర మహనీయుల చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతలక్ష్మి, వడ్డె కార్పొరేషన్ చైర్మన్ వెంకటలక్ష్మి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీనివాస్, కడియాల వీరభద్రరావు, బుడ్డిగ రాధా, కడలి రామకృష్ణ పాల్గొన్నారు.



పిల్లలైన.. పెద్దలు!

పెద్దలు పిల్లలైపోయారు.. కాసేపు తమ బాల్యంలోకి వెళ్లిపోయారు.. ఏరా ఎలాగున్నావ్.. ఏమేవ్ బాగున్నావా అంటూ ఒకరినొకరు పలకరించుకున్నారు.. నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు.. 1973లో కొవ్వూరు గవర్నమెంటు హైస్కూల్‌లో 10 తరగతి, 1973-75 సంవత్సరంలో కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల తరువాత కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో ఆదివారం కలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు.. - కొవ్వూరు

తరలెళ్లిపోతున్న పల్లె జనం

(మొదటి పేజీ తరువాయి)

50 నుంచి 100 కుటుంబాలకు పైగా ఇప్పటికే ఊరు వదిలి వెళ్లారు. ముఖ్యంగా తెలంగాణలోని మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు, ఏపీలోని గుంటూరు జిల్లాకు వెళ్తున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పది వేల కుటుంబాలు పొట్టచేత పట్టుకొని సుగ్గి బాటన సాగిపోయి ఉంటారని అనధికారిక అంచనా. దీంతో గ్రామాలన్నీ బోసిపోతున్నాయి. తల్లిదండ్రులతో పిల్లలు కూడా వెళ్లడంతో పాఠశాలల్లో హాజరు తగ్గిపోతోంది.


వలస వెళ్తున్న పిల్లలకు వీడ్కోలు పలుకుతున్న వృద్ధులు

కిలో పత్తి తీస్తే రూ. 15

కర్నూలు జిల్లాలో 5.62 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అత్యధికంగా పత్తిసాగు చేసిన జిల్లాల్లో గుంటూరు తర్వాతి స్థానం దీనిదే. అయితే అధిక వర్షాలకు తేమ ఎక్కువై చెట్టుపైన కాయలు నల్లగా మారి కుళ్లిపోయాయి. ఉన్న అరకొర పత్తి చెట్టు పైనే మొలకలొచ్చి నేలపాలయింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు పైగా దిగుబడి రూపంలో నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పెద్ద రైతులు పత్తితీత పనులకు పిలిచినా రూ. 300-400 మించి కూలి ఇవ్వడం లేదు. ఆరు నెలలుగా ఉపాధి హామీ కూలి డబ్బులు అందకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారం అవుతుండటంతో వలసబాట పట్టారు. మహబూబ్‌నగర్, వికారాబాద్, గుంటూరులో కిలో పత్తి తీస్తే రూ. 15 నుంచి రూ. 18 చొప్పున ఇస్తున్నారు. 'దంపతులిద్దరూ రోజుకు వంద కిలోల పత్తి తీస్తే రూ. 1,500 వస్తుంది. ఇద్దరు పిల్లలు కూడా పనిలోకి వెళితే మరో రూ.వెయ్యి సంపాదించవచ్చు. ఇలా రోజుకు సుమారు రూ. 2,500, నెలంతా కష్టపడితే దాదాపు రూ.50 వేల నుంచి 60 వేలు సంపాదించుకోవచ్చని వలస బాట పట్టారు. గుంటూరు జిల్లాలో పత్తి తీత పనులు అయిపోగానే మిరప కోత పనులు మొదలవుతాయి. నాలుగైదు నెలలు పనులు ఉంటాయని ఆ జిల్లాకు ఎక్కువ వెళ్తున్నారు.

ఆ ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే..

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణే ప్రధాన లక్ష్యంగా 2019లో నాడు టీడీపీ ప్రభుత్వం వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి నిధుల మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులను అటకెక్కించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకూ పనుల్లో కదలికలేదు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం పల్లెసీమల వలసలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణమే ఏకైక పరిష్కార మార్గమని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరెకరాలున్నా.. వలస బాటే

చింతకుంటకు చెందిన పునులు యల్లప్ప, పద్మ దంపతులకు బోరుబావి కింద ఆరెకరాల పొలం ఉంది. 3 ఎకరాల్లో పత్తి, మరో 3 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. రూ.4 లక్షలకు పైగా అప్పు చేశారు. ధరలు పతనమవడంతో ఉల్లి పంటను పొలంలోనే వదిలేశారు. అధిక వర్షాలకు పత్తికూడా పాడైపోయింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక బడికి వెళ్లే ఇద్దరు పిల్లలను తీసుకొని వికారాబాద్‌కు వలస వెళ్తున్నానని యల్లప్ప చెప్పాడు.

డిజిటల్ ప్లంబింగ్‌తో

విస్తృత పెట్టుబడులు

- బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ అభివృద్ధి
- 'ఆంధ్రజ్యోతి'తో సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"డిజిటల్ ప్లంబింగ్"తో విశాఖపట్నానికి విస్తృత స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తాయని సిఫీ టెక్నాలజీస్ చైర్మన్ రాజు వేగేశ్న తెలిపారు. రుషికొండ ఐటీ పార్కులో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విశాఖ కాస్మోపాలిటన్ నగరమని, ప్రస్తుతం ఐటీలో ద్వితీయ శ్రేణి (టైర్-2) నగరంగా ఉందని, త్వరలో ప్రథమ శ్రేణి నగరాలతో పోటీ పడుతుందని చెప్పారు.

ప్రశ్న: డిజిటల్ ప్లంబింగ్ అంటే..?

రాజు వేగేశ్న: సముద్రం అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుళ్లతో విశాఖలోని సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను అనుసంధానం చేస్తాం. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న సమాచారాన్ని ఇక్కడికి తీసుకొస్తాం. అవసరమైన రాష్ట్రాలకు, దేశాలకు పంపిస్తాం. ఇలా డేటాని పంపింగ్ చేయడాన్ని 'డిజిటల్ ప్లంబింగ్'గా వ్యవహరిస్తాం. ఇందులో విశాఖ అగ్రస్థానంలో నిలవనుంది. డిజిటల్ ప్లంబింగ్ వల్ల మరిన్ని డేటా సెంటర్లు వస్తాయి. త్వరలోనే ఒక గిగావాట్, రెండు గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు ఏర్పాటవుతాయి. విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది.

భారీగా ఉద్యోగాలు వస్తాయా?

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఎలాగైతే ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేసి సమాజానికి అందిస్తున్నాయో.. డేటా సెంటర్లు కూడా ఆ విధంగానే పనిచేస్తాయి. వీటి వల్ల ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నా.. పరోక్షంగా ఎకో సిస్టమ్ అభివృద్ధి చెంది పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. ఐటీలో అగ్రస్థానంలో ఉన్న బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ ఎంతో అభివృద్ధి సాధిస్తుంది.

ఈ రంగంలో మీకున్న అనుభవం ఏమిటి?

భారత్‌లో 25ఏళ్ల క్రితమే డేటా సెంటర్లను సిఫీ ప్రారంభించింది. ముంబైలో 250 మెగావాట్లు, నోయిడాలో 130 మెగావాట్లు, చెన్నైలో మరో 130 మెగావాట్ల డేటా సెంటర్లు నిర్వహిస్తున్నాం. నాస్డాక్‌లో నమోదైన రెండు కంపెనీల్లో ఒకటి ఇన్ఫోసిస్ అయితే రెండోది సిఫీ. డేటా సెంటర్ ఆపరేషన్లు రెండేళ్లలో ప్రారంభించాలనే లక్ష్యంతో విశాఖ వచ్చాం. నేను ఏపీకి చెందినవాడినే. మంత్రి లోకేశ్ చాలాకాలం నుంచి తెలుసు. విశాఖ కాస్మోపాలిటన్ నగరం. ఇక్కడ అన్ని ప్రాంతాల వారు ఎటువంటి భేదభావాలు లేకుండా కలిసి మెలిసి ఉంటారు. ఇక్కడ అందమైన బీచ్‌లు ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. వీటన్నింటి కంటే మంచి పాలసీలు, పూర్తి సహకారం అందించే ప్రభుత్వం ఉండటం వల్లనే ముందుకొచ్చాం.

హైదరాబాద్‌కు దీటుగా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం రుషికొండ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో సిఫీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని లోకేశ్ జ్యోతి వెలిగించి ప్రారంభించి, ప్రసంగించారు. గత 17 నెలల్లో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా అందులో 50శాతానికి పైగా విశాఖ జిల్లాకే వచ్చాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు భారీగా రావడం ఇదే మొదటిసారని, ఇదంతా ఒక్కరోజులో సాధ్యం కాలేదని చెప్పారు. సుదీర్ఘ చర్చలు, అనేక మంది కీలకంగా వ్యవహరించడం వల్లనే వచ్చాయన్నారు. సిఫీ సంస్థను ఏపీకి రప్పించడానికి ఎనిమిదేళ్లు పట్టిందన్నారు. రాష్ట్రానికి విశాఖపట్నమే ఆర్థిక రాజధాని అని, అభివృద్ధి విషయంలో వికేంద్రీకృత విధానం అనుసరిస్తున్నామని చెప్పారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో ఒక్క విశాఖలోనే 5లక్షల ఐటీ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. టీసీఎస్‌కు ఎకరా భూమి 99 పైసలకే ఇస్తే విమర్శించారని, అయితే ఆ నిర్ణయం కారణంగా కాగ్నిజెంట్, యాక్సెంచర్, ఏఎన్ఎస్ఆర్, సత్వాల్, గూగుల్ వంటి పెద్ద సంస్థలు విశాఖకు వచ్చాయన్నారు. పెట్టుబడుల విషయంలో ఏపీ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతోనే కాకుండా ఇతర దేశాలతో కూడా పోటీ పడుతోందని చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) కేంద్రంగా ఏపీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఏ జీసీసీ అయినా ఏపీకే రావాలన్నారు.

బుల్లెట్ ట్రైన్ వేగం

ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కారు మాత్రమే కాదని, బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకుపోయే ప్రభుత్వమని లోకేశ్ అభివర్ణించారు. ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ఢిల్లీ వెళితే... ఏపీకి వెళ్లాలని, అక్కడ వేగంగా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం ఉందని సూచిస్తున్నారని, అది రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. రైల్వే జోన్ సాధించుకున్నామని, విశాఖ స్టీల్ ప్లాంటు కష్టాల్లో ఉంటే కేంద్రం రూ.11,440 కోట్లు ఇస్తే రాష్ట్రం రూ.4 వేల కోట్ల సాయం అందిస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంటు ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌తో నడిస్తే ఇప్పుడు 3 బ్లాస్ట్ ఫర్నేసులతో 85% ఉత్పత్తి చేసే స్థాయికి చేరిందని తెలిపారు. మరో 3 నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని చెప్పారు. విశాఖ అభివృద్ధికి రాష్ట్ర మంత్రివర్గం బ్లాంక్ చెక్ ఇచ్చిందని, దాంతో దూకుడుగా వెళ్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు సిఫీ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. తొలిదశలో 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటు చేస్తారు.


సిఫీ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న లోకేశ్

4 జిల్లాలతో గ్రేటర్ విశాఖ

ఎకనమిక్ జోన్: లోకేశ్

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు 4 జిల్లాలతో 'గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. 'మహా విశాఖ ఆర్థిక మండలి' నిర్వహణ, విధివిధానాలపై సీఎం ప్రకటన చేస్తారని చెప్పారు. పరిశ్రమలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే నాటికి రోడ్లు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటుకానున్న పరిశ్రమలు, కంపెనీల ద్వారా 5లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన రూ.లక్ష కోట్ల పెట్టుబడుల్లో సగం గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్‌కు వచ్చాయన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలంటే గ్రేటర్ జోన్ ఆర్థిక వృద్ధి ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని వివరించారు. వచ్చేనెల 14, 15ల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సులో మరిన్ని కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. మంగళవారం సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నారని చెప్పారు. గూగుల్ సంస్థ ద్వారా దేశంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇదేనన్నారు. టీసీఎస్‌కు కేటాయించిన భూముల్లో వచ్చే నెలలో శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. డిసెంబరులో కాగ్నిజెంట్ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఈవో వస్తున్నారని తెలిపారు. దేశంలో అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఉమ్మడి విశాఖలో ఏర్పాటుకాబోతున్నదన్నారు.

యూజ్‌లెస్ ఫెలో.. ఎవడ్రా నువ్వు!

- ఎమ్మెల్యే బూర్లపై నోరు పారేసుకున్న మాల మహానాడు నేత గోళ్ల
- తురకపాలెం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే, మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులును మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ అసభ్య పదజాలంతో దూషించారు. తురకపాలెంలో వరుస మరణాల నేపథ్యంలో ఆదివారం ఆయా కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం 28మందికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో బాధితులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీచేశారు. ఈ సాయం ప్రభుత్వం చేస్తోందని, దళారులు డబ్బులు అడిగితే ఇవ్వద్దని సూచించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అరుణ్ కుమార్ ఎమ్మెల్యేను చూస్తూ అంత దౌర్భాగ్యం తమకు రాలేదన్నారు. ఒక సమయంలో నియంత్రణ కోల్పోయి ఎమ్మెల్యే వైపు వేలు చూపిస్తూ 'ఎవడ్రా నువ్వు.. యూజ్ లెస్ ఫెలో' అంటూ దూషించడంతో పాటు తిట్లపర్వం అందుకున్నారు. ఈ ఘటనతో కేంద్ర మంత్రి, అధికారులు షాకయ్యారు. ఎమ్మెల్యే మీదకు దూసుకువచ్చిన అరుణ్‌కుమార్‌ను పోలీసులు తీసుకువెళ్లి పోయారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు నాయకులను గ్రామస్థులు అడ్డుకున్నారు. మా ఊళ్లో మీ పెత్తనం ఏమిటని నిలదీశారు. కాగా, కొందరు బాధితులు తమకూ ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు.


ఎమ్మెల్యే బూర్లకు వేలు చూపిస్తూ మాట్లాడుతున్న గోళ్ల అరుణ్‌కుమార్

బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు..

- వాడపల్లి వెంకన్న సన్నిధిలో మహాసుదర్శన హోమం
- వైభవంగా తోమాల సేవ
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఆత్రేయపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఆదివారం బ్రహ్మాండంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొని తరించారు. ఉదయం స్వామివారిని వసంత మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక వద్దకు తోడ్కొని వచ్చి వైఖానస శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపడింతులు, అర్చకులు బ్రహ్మోత్సవ పూజలను నిర్వహించారు. ఉదయం 9.10 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, మహాసప్నసము, హోమములు, దుష్టగ్రహ పరిహారార్థం మహాసుదర్శన హోమం, వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. అనంతరం మేళతాళ మంగవాయిద్యాలతో తోమాల ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం స్వామివారికి సమర్పించి తోమాల సేవను నిర్వహించారు. కేరళవాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వస్తివచనం ప్రధాన హోమములు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దంపతులు పాల్గొన్నారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్‌శోభగుల నడుమ శ్రీవారు కోదండరామ అలంకరణలో అలంకృతుడై హనుమత్‌వాహనంపై తిరువీధుల్లో వివిధ కళాకారుల ప్రదర్శనల నడుమ విహరించి కృపాకటాక్షాలు అందించారు.


హనుమత్ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

నేడు..

వాడపల్లిలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు సోమవారం యోగ నారసింహ అలంకరణలో శ్రీవారి సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.


ఉత్సవమూర్తులకు మహాసప్నసము దృశ్యం


మహిళా కళాకారుల వాయిద్య ప్రదర్శన

బాణసంచా పేలుడు ఘటనలో పదికి చేరిన మృతుల సంఖ్య

- చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి
- తమకు న్యాయం చేయాలంటూ అనపర్తిలో బంధువుల ఆందోళన


యామిని (ఫైల్)


వెంకటకృష్ణ (ఫైల్)

అనపర్తి/ రాయవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం విసావరం గ్రామ పరిధిలో గణపతి ఫైర్ వర్క్స్‌లో ఈనెల 8న జరిగిన అగ్ని ప్రమాదంలో ఆదివారం నాటికి మృతుల సంఖ్య పదికి చేరుకుంది. సంఘటనలో ఆరుగురు సజీవ దహనం కాగా మరో నలుగురు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా అదే రోజు ఒకరు, మరుసటి రోజు ఒకరు, ఆదివారం మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన రోజు యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ, పాకా అరుణ, చిట్టూరి శ్యామల, పెంకే శేషారత్నం, కురుపూడి జ్యోతి, కె.సదానంద్ సజీవదహనం కాగా అదే రోజు ఆసుపత్రిలో పొట్నూరి వెంకటరమణ మృతి చెందగా మరుసటి రోజు వాసంశెట్టి విజయలక్ష్మి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం చిట్టూరి యామిని (30), లింగం వెంకటకృష్ణ(22) చికిత్స పొందు తూ మృతి చెందారు. కాకినాడలో జీజీహెచ్‌లో అనపర్తికి చెందిన చిట్టూరి యామి ని మృతి చెందడంతో పోస్టుమార్టం అనంతరం అధికారులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని అనపర్తికి తరలించారు. అయితే యామిని బంధువులు మృతదేహాన్ని కొమరిపాలెంలోని యజమాని ఇం టికి తరలించే ఆలోచన చేయడంతో పోలీసులు అంబులెన్స్‌ను రెండు జీపులతో వెంబడించారు. బలభద్రపురం వంతెన వద్ద కొమరిపాలెం వైపు అంబులెన్స్‌ను మలుపు తిప్పే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు మృతదేహాన్ని అనపర్తిలోని యామిని ఇంటికి చేర్చారు. అంబులెన్స్ నుంచి మృతదేహాన్ని దించేది లేదంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి యామిని ఇంటికి అధి కారులను పంపించడమే కాకుండా ఫోన్‌లో యా మిని భర్త శ్రీనుతో మాట్లాడారు. ఇప్పటికే విచారణ కోసం కమిటీని నియమించడం జరిగిందని, 2,3 రోజుల్లో ఎక్స్‌గ్రేషియా ప్రకటన వెలువడుతుందని ఆందోళన చెందవద్దంటూ వివరించారు. యజమాని కుమారుడు చిట్టిబాబు కూడా శ్రీనుతో మాట్లాడటంతో మృతుల బంధువులు శాంతించారు. మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పెదపూడి మండలం వేండ్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ(22) ఆదివారం మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

తల్లీకూతూరు సాధించారిలా

- హైకోర్టు బార్ కౌన్సిల్‌లో తల్లీతనయలకు ఒకేసారి సభ్యత్వం

కాకినాడ/జీజీహెచ్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లి, తనయ ఇద్దరూ ఒకేసారి ఏపీ హై కోర్టు బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా పేర్లు నమోదు చేసుకున్న అరుదైన ఘటన కాకినాడలో జరిగింది. కాకినాడ రామారావుపేటకు చెం దిన మల్లిపూడి మెహెరానీ, ఆమె కుమార్తె లక్ష్మీ ఐశ్వర్య ఇద్దరూ న్యాయ విద్యనభ్యసించి.. న్యాయవాదులుగా హైకోర్టు బార్ కౌన్సిల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మెహరానీకి చిన్నప్పటి నుంచీ చదువంటే ప్రాణం. న్యాయవాదిగా మారాలనేది ఆమె సంకల్పం. తొలుత బీఎస్సీ డిగ్రీ పూర్తి చేయాలనుకున్న ఆమెకు తల్లిదండ్రులు వివాహం చేయడంతో అది నెరవేరలేదు. వివాహం అనంతరం ఆమె భర్త జీవీవీ సత్యనారాయణ ప్రోత్సాహంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసింది. అనంతరం రాజీవ్‌గాంధీ లా డిగ్రీ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరి.. తన కలను నెరవేర్చుకుంది. తనకు ఇష్టమైన న్యాయవాది డిగ్రీ పట్టా పొందింది. ఇక మరోవైపు తల్లి మెహెరానీ లాగే తనయ లక్ష్మీ ఐశ్వర్య కూడా న్యాయవాద వృత్తినే ఎంచుకుంది. ఆమె ఒడిశాలోని నేషనల్ లా యూనివర్సిటీ నుంచి బీబీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో ఎల్ఎ ల్ఎం చదువుతోంది. దీంతో తల్లీకుమార్తెలు ఇద్దరూ ఒకే రోజున రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్‌లో సభ్యులుగా చేరారు. తన భర్త సత్యనారాయణ (ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెకర్), కుటుంబసభ్యుల సహకారంతో ఇది సాధ్యమైందని మెహరానీ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. వారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు అభినందించారు.


హైకోర్టు బార్ కౌన్సిల్‌లో ఒకేసారి సభ్యత్వం పొందిన తల్లీకూతుళ్లు

పంచాయతీ ఉద్యోగులకు తీపి కబురు

- గ్రేడ్-1 కార్యదర్శులు 22 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

సామర్లకోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ వీఆర్.కృష్ణ తేజ్ ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం జిల్లాకు చేరిన ఈ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వివిధ పంచాయతీలలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్న 22 మంది అధికారులకు పదోన్నతులు కల్పించారు. వీరిని త్వరలో ఖాళీగా ఉన్న మండలాల్లో నియమించనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 16 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. ఒకేసారి ఈ పోస్టులు భర్తీ కానున్నాయి. అలాగే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు కూడా పదోన్నతి బదిలీలు కానున్నాయి. దీంతో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల ముఖాలలో దీపావళి కాంతులు ముందే రావడం విశేషం.


అనకాపల్లిలో యువతి కిడ్నాప్ చేబ్రోలులో బెదిరింపులు

- కారులో తిప్పుతున్న వ్యక్తులను పట్టుకున్న గొల్లప్రోలు పోలీసులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో యువతిని కిడ్నాప్ చేసి వివిధ ప్రాంతాల్లో కారులో తిప్పి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బెదిరిస్తుండగా పోలీసులు యువతిని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన యువతి కర్రి వంశీ, మహమ్మద్ అల్తాఫ్ అనే ఇద్దరిని ప్రేమించింది. దీనిపై వారి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11న ఉదయం 11గంటల సమయంలో అల్తాఫ్ సదరు యువతిని రాజానగరం బీచ్ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అల్తాఫ్, వంశీ, వంశీ స్నేహితుడు రాజు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని వివిధ ప్రాంతాల మీదుగా తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదుగా చేబ్రోలు శివారులోని మట్టిరోడ్డులోకి తీసుకెళ్లారు. ఎవరో ఒకరిని తేల్చుకోవాలంటూ యువతిని వారు కొట్టి బెదిరించారు. మళ్లీ సాంబ అనే మరో వ్యక్తితో యువతిని బెదిరించడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువతిని, బెదిరించిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. యువతి ఫిర్యాదుపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో సీసీ కెమెరాలు

- విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం : మంత్రి సవిత


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

రాజమహేంద్రవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీసీ హాస్టళ్లను మెరుగుపరిచే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నాం. ప్రతీ వసతిగృహం, గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంక్షేమ, చేనేత, జౌళి, లేపాక్షి శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. బీసీ వసతి గృహాల పరిస్థితిపై ఆరా తీశారు. సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ నిధులతో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. దోమలు రాకుండా మెస్‌లను ఉంచాలని, వేడి చేసి చల్లార్చిన నీరు, తాజాగా వండిన ఆహారం మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. విశ్రాంతి, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడుకోవడానికి క్వాయిన్ ఫోన్ సౌకర్యం కల్పించాలని ఆమె సూచించారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు సక్రమంగా ఉండాలని, వసతి గృహాల్లోని విద్యార్థులను అధికారులు తమ పిల్లలుగా భావించి బాధ్యతగా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తరచూ గురుకుల పాఠశాలలు, వసతిగృహాలు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు విధానం, పరిశుభ్రతను పరిశీలించాలన్నారు.

ఆప్కో లేపాక్షి విక్రయాల పెంపు

ఆప్కో, లేపాక్షి విక్రయాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని.. ఇప్పటికే మార్కెట్‌లో ఆప్కో రెడీమేడ్ వస్త్రాలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. మేక్ ఇండియా -మేడ్ ఇండియా దిశగా స్వదేశీ వస్తువులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అలవాటు చేయాలన్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పథకాల అమలు మరింత వేగవంతం కావాల్సి ఉందని చెప్పారు. ఈ ప్రాంతాల్లో 16 ఆప్కో షాపులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆంధ్రప్రదేశ్ బీసీ కో ఆపరేటివ్‌గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఆప్కో జీఎం కె.పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

యానాం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): యానాంలో శనివారం జరిగిన దారుణ హత్య కేసులో నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం యానాంలో కాకినాడ జిల్లా కాజులూరు మండలానికి చెందిన తిప్పిరిశెట్టి నారాయణస్వామి (33) హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్య ఘటనలో నిందితుడు మోకా ఆనందమూర్తి పరారీలో ఉండడంతో పట్టుకున్నామని యానాం సీఐ అడలరసన్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం సాయంత్రం యానాం పోలీస్‌స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఆనందమూర్తి తండ్రి మోకా వెంకటేశ్వరావు(57)ను గతంలో ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో చీటీల వ్యాపారి తిప్పిరిశెట్టి నారాయణస్వామి విచక్షణా రహితంగా దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ప్రతీకారం తీర్చుకునేందుకు ఆనంద్‌మూర్తి నారాయణస్వామిని హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. రిమాండ్ విధించడంతో ఆనంద్ మూర్తిని యానాం సబ్‌జైల్‌కు తరలించారు.

ముగిసిన ఉ-షు చాంపియన్‌షిప్ పోటీలు



ఉ-షు ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలికలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం తుమ్మలావలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీహాలులో జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలురు, బాలికల ఉ-షు చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జోన్-2 జాన్సన్ మెడల్ అందజేశారు. వివిధ కేటగిరీల్లో ఉష జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారు జమ్మూ కాశ్మీర్‌లో ఈనెల 28 నుంచి నవంబరు 1వ తేదీ వరకూ జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు ఏవీడీ ప్రసాదరావు, భువనేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల అబ్జర్వర్లు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఛైర్మన్, కోశాధికారి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్ మేనేజర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు బాక్సింగ్ పోటీల ఫైనల్స్..

కాగా, వర్షం కారణంగా పోటీల నిర్వహణకు వాతావరణం అనుకూలించకపోవడంతో బాక్సింగ్ పోటీలు సోమవారం నిర్వహిస్తున్నామని జాన్సన్ తెలిపారు. సెక్రటరీ భానుమూర్తి రాజు అనుమతితో ఈ పోటీలు ఒక రోజు వాయిదా వేశామని పేర్కొన్నారు.

పేర్ని నాని వ్యాఖ్యలకు ఖండన

కడియం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్రపై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన అనుచిత వ్యాఖ్యలను బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోన్-2 కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ నాయకులు ఖండించారు. ఆదివారం వేమగిరిలో చెల్లుబోయిన కార్యాలయంలో బీసీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్రపై వ్యక్తిగతంగా అవమానించడం బీసీ సమాజంపై దాడి చేసినట్లేనన్నారు. నాని తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేకుంటే బీసీ వర్గాల నుంచి తీవ్ర ప్రతిస్పందన ఎదురౌతుందన్నారు. ప్రభుత్వం బీసీ సంక్షేమానికి కృషిచేస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు పితాని శివరామకృష్ణ మాట్లాడుతూ బూతులు మాట్లాడే వైసీపీ నేతలకు ప్రజలు పోలింగ్ బూత్‌లలో గుణపాఠం చెప్పారని అయినా జ్ఞానోదయం కాకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో పితాని శివరామకృష్ణ, వాసంశెట్టి నాగబాబు, పితాని గోవిందు, పితాని నారాయణరావు పాల్గొన్నారు.

మొక్కలపై రైతుల శ్రద్ధ అభినందనీయం

తెలంగాణ హైకోర్టు జస్టిస్ మాధవీదేవి



జస్టిస్ మాధవీదేవికి మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

కడియం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మొక్కలపై నర్సరీ రైతులు చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి తెలిపారు. ఆదివారం కడియపులంక పుల్లా ఆంజనేయులు(అబ్బులు) - సత్యదేవా నర్సరీని ఆమె సందర్శించారు. అబ్బులు మనీప్లాంట్‌గోల్డ్ మొక్కతో స్వాగతించారు. నర్సరీలోని లోపాంథెరా లాక్టెసెన్స్ అనే అరుదైన మొక్క ప్రత్యేకతను వివరించారు. నర్సరీలో వివిధ రకాల పూలు, వృక్షాలు, ఆయుర్వేద మొక్కలను పరిశీలించిన జస్టిస్ మాధవీదేవి మాట్లాడుతూ ఆయుర్వేద మొక్కల పెంపకానికి మరింత ప్రాధాన్యమివ్వాలని, వాటిని అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని నర్సరీ రైతులకు సూచించారు. కార్యక్రమంలో పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు బలభద్రపురం శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులు

బిక్కవోలు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మించిన శివాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ మల్లిడి గంగారెడ్డి ఆదివారం తెలిపారు. కాశీలోని శివాలయం మాదిరిగా నిర్మించిన ఈ ఆలయంలోని గర్భగుడిలో నలువైపులా అష్టాదశ శక్తిపీఠ దేవతామూర్తులైన కామరూపాదేవి, జోగులాంబదేవి, మాణిక్యాదేవి, పురుహూతికాదేవి, భ్రమరాంబదేవి, మహాకాళిదేవి, మహాలక్ష్మిదేవి, ఏకవీరికాదేవి, శాంకరీదేవి, వైష్ణవిదేవి, మాధవేశ్వరీదేవి, విశాలాక్షిదేవి, గిరిజాదేవి, చాముండేశ్వరిదేవి, సింహళాదేవి, సరస్వతిదేవి, కామాక్షిదేవి, సర్వమంగళాదేవి విగ్రహాలను ప్రతిష్ఠ చేస్తామన్నారు. ముఖమండపంలో విద్యాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, కాలభైరవ, జయ,విజయ నం దీశ్వరులు, చండీశ్వర, మేధాదక్షిణామూర్తి, నవగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు.. ఆలయ ఆవరణలో ధ్వజస్తంభాన్ని ఉంచుతామన్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం జరిపి, మహాన్నదానం నిర్వహిస్తామన్నారు.కాగా ఆలయంలోని దేవతామూర్తులకు భక్తులు స్వయంగా అభిషేకాలు, కుంకుమ పూజలు జరుపుకోవచ్చని పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్.. దేశభక్తికి, క్రమశిక్షణకు మారుపేరు



ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని వివరిస్తున్న పట్టాభి

బిక్కవోలు, అక్టోబరు 12(ఆంధ్ర జ్యోతి): దేశభక్తికి, క్రమశిక్షణకు మారుపేరు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అని సంఘ నేత పట్టాభి అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా బిక్కవోలులో ఆదివారం విజయదశమి ఉత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 81వేల శాఖల ద్వారా లక్షలాది మందిని దేశభక్తి,క్రమశిక్షణ గల వ్యక్తులుగా ఆర్‌ఎస్‌ఎస్ తయారు చేసిందన్నారు. ఆర్ఎస్ఎస్ సేవకులుగా పనిచేసిన నరేంద్రమోదీ, వాజ్‌పేయి ప్రధానులయ్యారని, అలాగే కేంద్రంలో ప్రస్తుతం 38 మంది మంత్రులు ఆర్ఎస్ఎస్ సేవకులేనన్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉండబట్టే రామమందిరాన్ని నిర్మించుకుకోగలిగామన్నారు.ఆర్‌ఎస్‌ఎస్ భావాలను దేశంలోని మారుమూల గ్రామాలకు విస్తరించడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి శ్రీనివాస్, నాగరాజు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం శివాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ కోరుకొండ ఖండ సహ కార్యవాహ సుధాకర్ విచ్చేసి మాట్లాడుతూ వ్యక్తి నిర్మాణం, ప్రజల్లో దేశభక్తి నింపడం ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్య లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ విభాగ్ కన్వీనర్ బండ్ల గణేష్, బీజేపీ నాయకులు ఏపీఆర్ చౌదరి రాపాక వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కూటమిలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం

ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



శ్రీరామ్‌కు గజమాలతో ఆహ్వానం పలుకుతున్న దృశ్యం

సీతానగరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం అన్ని వర్గాల సమతుల్యతతోనే కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆదివారం మండలంలోని మునికూడలి గ్రామంలో జరిగిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కూటమి అజేయంగా కొనసాగుతోంద ని, మళ్లీ వచ్చే ఎన్నికల్లో ను విజయం సాధిస్తామన్నారు. ఈ ప్రాం తంలో తమ కుటుంబానికి ఇంత ఆదరణ ఉందని ఊహించలేదని చాలా సంతోషంగా ఉందన్నారు. ముందుగా బొబ్బిల్లంక నుంచి మునికూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ శ్రీరామ్‌ను ఎమ్మెల్యే బత్తుల బలరామ్, బీవీఆర్ చౌదరి గజమాలతో ఆహ్వా నించారు. అనంతరం ఈ ముగ్గురు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సానిపిని రామారావు, రాచూరి బావోజీరావు, గెడ్డం తిమ్మారావు, గద్దే వెంకటకృష్ణ చౌదరి(నల్లి), వలవల రాజా తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ జామ్

దివాన్‌చెరువులో తరచూ ట్రాఫిక్ సమస్యలు

- 16వ నెంబరు జాతీయ రహదారికి మరమ్మతులు
- గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- ప్రారంభం కాని ఫ్లయ్‌ఓవర్ పనులు
- సేకరించిన స్థలాల్లో చిరువ్యాపారాలు



దివాన్‌చెరువు వద్ద ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు



జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న వాహనదారులు



రోడ్డు పక్కన చిరువ్యాపారాలు



దివాన్ చెరువు జంక్షన్

దివాన్‌చెరువు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై దివాన్‌చెరువులో ట్రాఫిక్ జామ్ పరిపాటిగా మారింది. పరిసర గ్రామాల రహదారులను కలుపుతూ ఏర్పాటు చేసిన కూడళ్లలో వాహనచోదకులు రహదారిని దాటి రెండో ప్రక్కకు వెళ్లేందుకు చాలా సమయం వేచి ఉండవలసివస్తోంది. ఆ తర్వాత కూడా భయం భయంగా రహదారిని దాటవలసిన పరిస్థితి నెలకొంటోంది. అలాగే జాతీయ రహదారిపై తరచు మరమ్మతులు సాగిస్తున్నారు. పనులు జరిగే చోట్ల స్టాపర్లు పెట్టి ఒకవైపు రాకపోకపోకలను నియంత్రించడంతో వాహనాలు వేగం నెమ్మదిస్తోంది. పని జరిగే ప్రాంతానికి దాదాపు కిలోమీటరు దూరం వరకూ బంద్ చేస్తున్నారు. దీనితో ఒకే మార్గంలో వాహన రాకపోకలు సాగించాల్సి రావడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. అంతేకాకుండా ఒక్కొక్కసారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. జాతీయ రహదారికి అత్యంత దగ్గరగా కొంతమంది సాగిస్తున్న వ్యాపారాలు కూడా వాహనదారులను కొన్ని సందర్భాల్లో ఇబ్బందుల్లో పడేస్తున్నాయి..

గస్తీ పెంచాలి

16వ నెంబరు జాతీయ రహదారిపై దివాన్ చెరువు జంక్షన్ నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. పాఠశాలలు, వివిధ విద్యాసంస్థలకు చెందిన బస్సులు తిరిగే ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటోంది. అదే సమయంలో ఈ రహదారి మీదుగా కార్యాలయాల్లో విధులకు వెళ్లి, వచ్చే ఉద్యోగులు సైతం గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలని భావిస్తుంటారు. అయితే తరచూ ఏర్పడే ట్రాఫిక్ జామ్‌లతో అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఉద్యోగులైతే సకాలంలో తమ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు వేయాలన్న ఆతృతతో వేగంగా ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలూ ఉంటున్నాయి. ఇక దివాన్‌చెరువు జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీస్‌లు, బొమ్మూరు పోలీసులు గస్తీ కాస్తూ ప్రమాదాలను కొంతవరకూ నివారించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే లాలాచెరువు వైపు నుంచి రాజానగరం వైపు వెళ్లే వాహనాలనూ, అలాగే దివాన్‌చెరువు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలను నియంత్రించేందుకు, దివాన్‌చెరువులో అపసవ్యదిశలో నడిపే వాహనాలను అడ్డుకునేందుకు వీలుగా దివాన్‌చెరువు జంక్షన్‌లో గస్తీ పెంచాల్సిన అవసరం ఉంది.

ఫ్లయ్‌ఓవర్‌తో భద్రత..

దివాన్‌చెరువు వద్ద ఫ్లయ్‌ఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ కూడలి నుంచి గామన్ బ్రిడ్జి జంక్షన్ కలుపుతూ ఫ్లయ్‌ఓవర్‌ను దాదాపు రూ.300 కోట్లతో నిర్మాణం జరుగనుంది. 8 నెల క్రితమే ఈ వంతెనకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో దీనికి సంబంధించి భూసేకరణపనులను సంబంధిత అధికారులు చేపట్టారు. 2027లో జరుగనున్న గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తిచేస్తామని కొంతమంది నాయకులు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఫ్లయ్‌ఓవర్ కోసం సేకరించేందుకు నిర్ణయించిన స్థలాలల్లో నిర్మాణాలను దాదాపు ఐదు నెలలక్రితమే అధికారులు తొలగించారు.



సాయిబాబా గుడి వద్ద వాహనాల రద్దీ

ప్రారంభం కాని పనులు.. ఇబ్బందులు

కానీ ఇంతవరకూ ఫ్లయ్‌ఓవర్ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో వంతెన కోసం ఖాళీ చేసిన స్థలాల్లో కొంతమంది వ్యాపారులు జాతీయ రహదారికి అత్యంత దగ్గరగా తోపుడు బండ్లు, టెంట్లు ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాలను సాగిస్తున్నారు. దీనితో రద్దీ సమయాలలో రహదారి మార్జిన్ దిగేందుకు కొన్ని చోట్ల వీలు కావడంలేదని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు. ఫ్లయ్‌ఓవర్ పూర్తయితేనే ట్రాఫిక్ సమస్యలు తీరి, రహదారి భద్రత మెరుగవుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



దివాన్‌చెరువు వద్ద వాహనాల రద్దీ

ఎమ్మెల్యే గోరంట్లను కలిసిన మంత్రి సవిత



మంత్రి సవితకు స్వాగతం పలుకుతున్న గోరంట్ల దంపతులు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాజమహేంద్రవరం విచ్చేసిన బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత స్థానిక గాంధీపురంలోని నివాసానికి విచ్చేసి గోరంట్ల బుచ్చయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆమెకు గోరంట్ల దంపతులు ఘన స్వాగతం పలికారు.అనంతరం అల్పాహారం భుజిస్తూ పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో గోరంట్ల రవి రామ్‌కిరణ్, వీరంకి వెంకట గురుమూర్తి, మార్ని వాసుదేవరావు, వాసిరెడ్డి రాంబాబు, మార్గాని సత్యనారాయణ, మజ్జి పద్మ, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

నర్సరీల సందర్శనకు రండి

కడియం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సంజీవరెడ్డిని ఆదివారం రాష్ట్ర ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నివాసానికి విచ్చేసిన మంత్రికి మొక్కను అందజేసి కడియం నర్సరీలను సందర్శించాలని ఆహ్వానించారు. తమ ప్రాంతం మొక్కలతో ఎంతో ఆహ్లాదంగా ఉంటుందని, నర్సరీల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు మత్యేటి ప్రసాద్, పితాని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



కోరుకొండలో శ్రీరంగనాథ ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న కోరుకొండలో శ్రీ రంగనాథ స్వామి ఆలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేయనునట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. అన్నవరం దేవస్థానం, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధికారులతో కలిసి ఆయన ఆదివారం రంగనాథ ఆలయాన్ని పరిశీ లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీర్ణావస్థకు చేరిన రంగనాథ ఆలయం పై గత ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల సహకారంతో ఆలయాన్ని అ భివృద్ధి చేస్తామన్నారు. ఈనెల 24న ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు, ధర్మకర్త పరాసర రంగరాజ బట్టర్ స్వామి అర్చకుడు గిరిధర్, బత్తుల వెంకటలక్ష్మి, సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ వితరణ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సంబంధించిన విద్యార్థుల స్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈమేరకు ఆదివారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ ఈ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించి పలు మండలాలకు పంపిణీ చేశారు. కృష్ణ-గుంటూరు జిల్లా పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తమ తల్లిదండ్రుల పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఈ మెటీరియల్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నారని ఈ సందర్భంగా జయకర్ తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్‌రావు, ఎం.విజయగౌరీ, కె.రమేష్, వివిధ మండలాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలు విగ్రహానికి ఎమ్మెల్సీ సోము పుష్పాంజలి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ఏ పాట పాడినా పాటతో మమేకమై, ప్రేమతో పాడేవారని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బాలు భౌతికంగా లేకపోయినా, ఆయన పంచిన గానామృతం సంజీవని అన్నారు. స్థానిక రాకా సాంస్కృతిక శాఖ, ధవళేశ్వరం గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ధవళేశ్వరం జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని సోము వీర్రాజు ఆదివారం ఉదయం సందర్శించి పుష్పాంజలి ఘటించారు. శంకరాభరణం చిత్రంలో బాలు పాడిన పాటలు అజరామరంగా శోభిల్లాయని సోము ప్రస్తావించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము, మునిసిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావు లను రాకా కార్యదర్శి జీవీ రమణ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మదర్షా ఆలీ, తిరుమల కృష్ణమోహన్, గాదిరాజు రామరాజు, మూడెడ్ల రమేష్, పుసులూరి శేషకుమార్,రాయుడు చంద్రకుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి

అనపర్తి డివిజన్ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే నల్లమిల్లి



ఆత్మ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయని ఆత్మ కమిటీలు కూడా కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో అనపర్తి డివిజన్ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా ఆత్మ కమిటీ ఛైర్మన్‌గా రంగంపేట టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి సత్యనారాయణ, మరో 24 మంది డైరెక్టర్లతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిందని,కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నీటి సంఘాలు, మార్కెట్ కమిటీలు, ఆత్మ కమిటీలను ఏర్పాటు చేసి రైతులకు బాసటగా నిలిచిందన్నారు. రైతులు సాగులో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, రావాడ నాగు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులను ఉత్సాహపరిచేందుకే క్రికెట్ పోటీలు

టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వాసు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): తమ కుటుంబ సభ్యులైన టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకే సిటీ టీడీపీ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక లూథర్‌గిరి గ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం టోర్నమెంట్‌ను ఆయన బ్యాటింగ్ చేసి క్రికెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ పది రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. క్రీడలు ఆరోగ్యానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్ని కృష్ణ, నక్కాదేవి వరప్రసాద్, మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ దినోత్సవం

కడియం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామిరెడ్డిపల్లిలో అంతర్జాతీయ పాస్టర్స్ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక బైబిల్ మిషన్ పాస్టర్ రతన్‌రాజు-సరోజిని దంపతులకు సంఘ విశ్వాసులు బొకే, పూలమొక్కలు, నూతన వస్త్రాలు అందజేసి గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విత్తనాల సాయికుమార్, కొండేటి ప్రసాద్, పాదూరి ప్రవీణ్, విజయ్, స్వాతి, శ్యామల పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీ వాగ్దేవి కళాపీఠం ఆధ్వర్యాన స్థానిక తాడితోట సంహిత డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్ చేసిన అవధానం శ్రోతలను అలరించింది. ధూళిపాళ మహదేవమణి, సంచాలకత్వం వహించారు. సురభి శంకర శర్మ, టీఎం.భ్రమరాంబిక, వేదాల గాయత్రిదేవి, ఎంవీఎస్ఎన్ మూర్తి, నాగులపాటి మహతి తేజశ్రీ, ప్రభల శ్రీవల్లి,ఘట్టి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై విస్తృత ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సూపర్ జీఎస్టీ 2.0పై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రెండో వార్డులో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ ప్రజాప్రచార కార్యక్రమం జరిగింది. నవీన్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే మేలులను వివరించారు. ప్రజల సౌకర్యార్థం కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, నాగమణి, భద్రరావు, నాగు, ఆదిబాబు, రమణమ్మ పాల్గొన్నారు.

పీఎంపీలకు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రాథమిక చికిత్సలు అందించే పీఎంపీలు, బ్రెయిన్ స్ట్రోక్ పై అవగాహన కలిగి ఉండాలని స్థానిక నీలిమ న్యూరో వైద్యనిపుణారాలు డాక్టర్ సాయి నీలిమ చల్లా అన్నారు. హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నీలిమ చల్లా మాట్లాడుతూ మెదడుకు రక్త సరఫరా నిలిచిపోవడం లేదా తగ్గడం వల్ల మెదడు కణాలు దెబ్బ తినడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని, దీనికి తక్షణమే తొలి నాలుగు గంటలలో అత్యవసర వైద్య సహాయం అందిస్తే, రోగిని పక్షవాతం బారి నుంచి కాపాడవచ్చని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ క్రొవ్విడి రాజేష్, తోరాటి ప్రభాకరరావు, బళ్లా శ్రీనివాస్, మట్టా రమేష్, సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వైద్యులను సభ్యులు సత్కరించారు.

వివేకానందుడి బోధనలు యువతకు తెలపాలి

రాజమహేంద్రవరం కల్చరల్ ,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందుడి బోధనలతో నేటి యువతకు పెద్దలు మార్గదర్శం చేయాలని మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ కోరారు. తాడితోట సెంటరులోని సంహిత కళాశాల ఆడిటోరియంలో ఆదివారం వాగ్దేవి కళాపీఠం ఆధ్వర్యంలో సామాజిక సేవకుడు, కొత్తపల్లి సీతారామరావు, జానకిరత్న దంపతులకు జరిగిన ఆత్మీయ సత్కార సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గోపాలకృష్ణ మాట్లాడుతూ, నేటి చదువులు విజ్ఞానంతో సంబంధం లేకుండా, డబ్బు చుట్టూ తిరుగుతున్నాయన్నారు. ఐతే ధనం తాత్కాలికమని, నేటి యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలను, కుటుంబ బంధాలను, పెద్దల పట్ల వినయ విధేయతలను నేర్పించాలని సూచించారు. బీఎస్ఎన్ఎల్ పూర్వ ఉద్యోగి కొత్తపల్లి సీతారామారావు సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా సీతారామారావు, జానకిరత్న దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో రచయిత జోరా శర్మ, చిత్రకారుడు పరస రవి, పరస రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రచయితల సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్‌లోని టౌన్‌హాల్‌లో ఆదివారం కళాగౌతమి రచయితల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ రానున్న పుష్కరాల్లో కళాగౌతమి సంస్థ విశిష్టమైన కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని సంకల్పించిందని తెలిపారు.కార్తీక దీపావళి వైభవం అనే అంశంపై కవులు తమ కవితలతో అలరించారు. కార్యక్రమంలో ముంగడ సూర్యనారాయణమూర్తి, బిహెచ్ రమాదేవి, పీవీబీ సంజీవరావు, వీవీ సుబ్రహ్మణ్యం, సీతామహలక్ష్మి, మల్లెమొగ్గల గోపాలరావు, వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.



మార్గదర్శులు.. ఉపాధ్యాయులు



కడియం,అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ద్వారానే ఉత్తమ సమాజం తయారవుతుందని..భవిష్యత్ మార్గదర్శులు ఉపాధ్యాయులేనని డీఈవో కె.వాసుదేవ రావు,అడిషనల్ ఎస్పీ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్,వరదా ఫౌండేషన్ ఆర్గనైజర్ వరదా సుబ్బారావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లో మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపా ధ్యాయులు, రాష్ట్ర,జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు 40 మందిని సత్కరించారు.డీఎస్సీలో ద్వితీయ స్థానంలో నిలిచిన వెలుగుబంటి అన్నపూర్ణను అభినందించారు.

గోవిందా హరి గోవిందా!

గోవిందా హరి గోవిందా.. గోకులనందన గోవిందా అంటూ కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామిని భక్తజనం కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం బ్రహ్మాండంగా నిర్వహించారు. ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారు కోదండరామ అలంకృతుడై హనుమద్వాహనంపై తిరువీధుల్లో విహరించారు. అశేష భక్తజనం వాహన సేవలో పాల్గొని తన్మయత్వం పొందారు.

8



రాయవరంలో ఈ నెల 8న దగ్ధమైన బాణసంచా తయారీ కేంద్రం

బాధితుల ఫైర్!

పరిహారానికి డిమాండ్

- రాయవరంలో ప్రమాదం
- 10కి చేరిన మృతుల సంఖ్య
- నేటికీ బాధితులకు అందని సాయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరంలో ఈ నెల 8న జరిగిన బాణసంచా భారీ విస్ఫోటనంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. నాటి ఘటనలో సంఘటనా స్థలంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. నలుగురు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక్కొక్కరిగా మృత్యువాత పడ్డారు. దీంతో ఆదివారం నాటికి బాణసంచా మృతుల సంఖ్య పదికి చేరింది. మొత్తం మృతుల్లో ఒకరు ఒడిశా ప్రాంతానికి చెందినవారు కాగా మరొకరు శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు ఉన్నారు.మిగిలిన 8 మందిలో అనపర్తి, పెదపూడి, రాయవరం ప్రాంతాలకు చెందిన మహిళా కూలీలు ఉన్నారు. దినసరి కార్మికులుగా పనిచేస్తూ జీవనం గడుపుకుంటున్నారు. వీరికి అటు ప్రభుత్వం తరఫున గానీ, ఇటు ఫైర్‌వర్క్స్ యాజమాన్యం తరఫున గానీ ఎటువంటి సహాయం అందలేదు. యాజమాన్య సంస్థ కార్మికుల పేరిట బీమా వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో మృతుల కుటుంబాలవారు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వ పరంగా తమ కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లతో పాటు ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వెళ్లినప్పుడు తమ కుటుంబాలను ఆదుకోవాలంటూ వేడుకోలు చేసుకున్నారు. ప్రభుత్వం రాయవరం ఘటనపై విచారణ కమిటీని నియమించిందని...ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రభుత్వం ప్రకటిస్తుందనే సమాచారాన్ని ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబీకులకు చెబుతున్నారు. పది మంది కుటుంబీకులకు ప్రభుత్వం నుంచి తక్షణసాయం అందించి ఆదుకోవాలంటూ ఇప్పటికే ప్రజాసంఘాలు వారి పక్షాన నిలబడి ఆందోళన చేపట్టాయి. ఇదే డిమాండ్‌ను స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి బాధిత కుటుంబీకులు తీసుకువెళ్లారు. తమకు న్యాయం చేయాలని బాధితులంతా ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కోరుతున్నారు.

గురువులు.. కొత్త కొలువులు!



రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కొత్త టీచర్లు(ఫైల్)

- నేటి నుంచి స్కూళ్లకు కొత్త మాస్టార్లు
- మెగా డీఎస్సీ-2025 ద్వారా ఎంపిక
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీల భర్తీ
- మాట నిలుపుకున్న కూటమి సర్కారు
- నూతన ఉపాధ్యాయుల ఆనందం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అంతా అనుకున్నట్టే జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేసింది. కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేయడంతో పాటు పోస్టింగ్ ఉత్తర్వులూ అందించింది.దీంతో నూతనోపాధ్యాయులు సోమవారం నుంచి బడిబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. పాఠాలు చెప్పే పనిలో బిజీబిజీగా అవనున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం జనవరిలో మరో డీఎస్సీ నిర్వహణకు సిద్ధమవుతోంది.మరో మూడు వేల పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తోంది.

టీచర్ల కొరత తీరింది..

కూటమి ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల కొరత తీర్చింది.మెగా డీఎస్సీ-2025 ద్వారా ఖాళీలను భర్తీ చేసింది. ఎంపికైన కొత్త గురువులు ఇప్పటికే ఎనిమిది రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు.అనంతరం ఉపా ధ్యాయుల వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రకటించారు. వారికి కావాల్సిన స్థానాన్ని ఎంపిక చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. శనివారం నూతనోపాధ్యాయులు ఎంచుకున్న స్థానాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు ఈ నెల 11వ తేదీన అభ్యర్థుల మొబైల్‌లోని లీప్ యాప్‌కు పంపారు. పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు అందరూ విద్యాశాఖాధికారులు సూచించిన అన్ని రకాల విద్యార్హతలు,కులం, ఆధార్, పాన్ కార్డు తదితర వాటిని తీసుకుని వారికి పోస్టింగ్ ఉత్తర్వుల్లో పేర్కొన్న పాఠశాలలకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారులు సూచించారు. కొత్త కొలువులో చేరేందుకు నూతనోపాధ్యాయులు సమాయత్తమవుతున్నారు.కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో మెగా డీఎస్సీ ద్వారా భారీగా ఉపా ధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారమే వేలాదిగా పోస్టులను భర్తీ చేసింది. ఉపాధ్యాయ వృత్తిలో తమను భాగస్వాములుగా చేసిందని 'కొత్త టీచర్లు' హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1693 పోస్టులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధి మెగా డీఎస్సీ-2025లో 1,241 పోస్టులకు 63,004 దరఖాస్తులు వచ్చాయి. 38,617 మంది పరీక్షలకు హాజరయ్యారు.ఎస్‌జీటీ 423, స్కూల్ అసిస్టెంట్ 818 ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ వి.భాగంలో ఎస్ఏ (పీఎస్) 3, ఎస్ఏ (బీఎస్) 4, ఎస్ఏ(పీఈ) 1,ఎస్‌జీటీ 104 ఖాళీగా ఉన్నాయి. జోన్-2 పరిధిలో ఏపీ రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/ట్రైబల్ (గురుకులం) యాజమాన్య పాఠశాలల్లో 348 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీటీ 24 పోస్టులు భర్తీ చేసేలా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.ఈ పోస్టులన్నింటికీ ఈ ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇచ్చింది.జూన్, జూలై నెలలో మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహించా రు.ఆగస్టులో కీ, ఫైనల్ ఫలితాలు వెల్లడయ్యాయి. ధ్రువపత్రాల పరిశీలన ఆగస్టు 28 నుంచి ఏడు దశల్లో జరిగింది. ఉద్యోగ నియామకపత్రాలు సెప్టెంబరు 25న అమరావతిలో అందజేశారు. అక్టోబరు మూడు నుంచి పదో తేదీ వరకు పలు కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు. వృత్తిలో పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాలు వివరించారు.విద్యాశాఖ విధివిధానాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

15 నుంచి విద్యుత్ ఉద్యోగుల

నిరవధిక సమ్మె

నేడు ఛలో విజయవాడ

రాజమహేంద్రవరం,అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగులు ఈ నెల 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నారు.దానికి ముందుగా సోమవా రం ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు.ఇంజనీర్లు తప్పించి, ఓఅండ్ఎం ఉద్యోగులంతా సమ్మె బాట పడుతున్నారు. 1999 నుంచి 2004 మధ్య విద్యుత్ సంస్థల్లో నియమించిన ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ ఇవ్వాలని, నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని, కాంట్రాక్టు సంస్థలను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 33/11 కేవీ సబ్-స్టేషన్లు కాంట్రాక్టర్లకు అప్పగించకూడదనే తదితర 15 డిమాండ్లతో ఉద్యోగులు సమ్మె బాట పట్టారు.ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అన్ని డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షణ ఇంజనీరు కె.తిలక్‌కుమార్ తెలిపారు.వినియోగదారులు సమస్య ఉంటే కింది నెంబర్లను సంప్రదించాలన్నారు.

కంట్రోల్ రూమ్‌లు

టోల్ ఫ్రీ నంబర్	1912
రాజమహేంద్రవరం	0883-2463354
	7382299960

డివిజన్ స్థాయిలో

రాజమహేంద్రవరం టౌన్	94906 10093
రాజమహేంద్రవరం రూరల్	94931 78874
నిడదవోలు	83329 73595
ఎస్ఈ	94408 12583
ఈఈ టెక్నికల్	94408 12584
ఈఈ ఆపరేషన్ టౌన్	94408 12585
ఈఈ ఆపరేషన్ రూరల్	73825 85487
ఈఈ నిడదవోలు	94408 12706

నిధుల.. దారులు!



అభివృద్ధి చేయనున్న గొల్లప్రోలు పరిధిలోని ప్రధాన రహదారి

ఉమ్మడి జిల్లాలో రోడ్లకు రూ 88.25 కోట్లు

- మూడో విడత ఇచ్చేశారు
- ఇప్పటికే రూ.96 కోట్లు విడుదల
- రెండు విడతలుగా కేటాయింపు
- టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- ఆర్అండ్‌బీ శాఖ కసరత్తు
- గుంతల్లేని రహదారులే లక్ష్యం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

రహదారుల అభివృద్ధికి నిధులు పుష్కలంగా విడుదలవుతున్నాయి. గుంతల్లేని రోడ్లు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగంగా ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే రెండు విడతల్లో నిధులు లభించగా, ఇప్పుడు మరో విడత నిధులను కేటాయించారు. టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయిస్తోంది.ఇప్పటికే రహదారులకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు అభివృద్ధి చేశారు.

టెండర్ల ప్రక్రియ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆర్అండ్‌బీ శాఖ ఆధీనంలో ఉన్న రాష్ట్ర, జిల్లా రహదారులు అభివృద్ధికి పలు విడతలుగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లో కేటాయించిన నిధులతో కొన్ని ప్రధాన రోడ్లకు అభివృద్ధి చేశారు. తదనంతరం రెండు విడతలుగా రహదారుల అభివృద్ధికి రూ.96 కోట్లు విడుదల చేశారు. ఈ పనులకు ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇందులో కొన్నింటికి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా మరికొన్ని పరిశీలన దశలో ఉన్నాయి. వీటిని వర్షాలు తగ్గగానే చేపట్టి మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.

మరో విడత నిధులు

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. 108 రాష్ట్ర రహదారులు అభివృద్ధికి రూ.400కోట్లు, 166 ప్రధాన జిల్లా రహదారులకు రూ.600 కోట్లు విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న 25 రాష్ట్ర, జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.88.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కాకినాడ జిల్లాలో 9 రోడ్లు అభివృద్ధికి రూ.35.25 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 10 రోడ్లకు రూ30.15 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో ఆరు రహదారుల అభివృద్ధికి రూ.22.85 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పనులు చేపట్టేందుకుగాను టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కాకినాడ జిల్లాకు ఇలా..

రాష్ట్ర రహదారుల్లో కాకినాడ జిల్లాలోని కాకినాడ-పైన రహదారి అభివృద్ధికి రూ.5 కోట్లు, నరసరావుపేట-కాత్రావులపల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, తుని-కత్తిపూడి మధ్య అత్యంత అధ్వానంగా ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ. 3.50 కోట్లు కేటాయించగా ప్రధాన జిల్లా రహదారుల్లో ఎర్రకోనేరు-వేమవరం రోడ్డుకు రూ.3.75 కోట్లు, మర్లావ-తిరుపతి-చంద్రమాంపల్లి రోడ్డు, కట్టమూరు-జె.తిమ్మాపురం రోడ్లు అభివృద్ధికి రూ.3.60 కోట్లు,తాళ్లూరు ఎన్‌హెచ్16-యల్లమిల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, సర్పవరం జంక్షన్-లైట్‌హౌస్ రోడ్డుకు రూ2.80 కోట్లు, అమీనాబాద్-యు.కొత్తపల్లి రోడ్డుకు రూ.4.20 కోట్లు, ఉండూరు బ్రిడ్జి-చేదువాడ-మంజేరు-పటవల రోడ్డుకు రూ.4.50 కోట్లు,గొల్లప్రోలు పట్టణం, చేబ్రోలు గ్రామాల పరిధిలోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.3.90కోట్లు కేటాయించారు.

కోనసీమ జిల్లాలో..

రాష్ట్ర రహదారుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సిరిపల్లి-మునిపల్లి రోడ్డు అభి వృద్ధికి రూ.3.50 కోట్లు, రాజవరం-పొదలాడ రోడ్డుకు రూ.3.90 కోట్లు, మండపేట-దుళ్ల రోడ్డుకు రూ.3.50 కోట్లు,సోమేశ్వరం-రాజానగరం రోడ్డుకు రూ.3.50కోట్లు, శివకోడు-మానేపల్లి రోడ్డుకు రూ.2.10 కోట్లు, ఇదే రోడ్డుకు మరో రూ.2.20 కోట్లు విడుదల చేశారు. ప్రధాన జిల్లా రహదారుల్లో విశ్వేశ్వరపురం-దిండి రోడ్డు, గూడపల్లి-గుబ్బలపాలెం-అడవిపాలెం-కేశనపల్లి రోడ్డు, మామిడికుదురు-అప్పనపల్లి-పాతపట్నం లంక రోడ్ల అభివృద్ధికి రూ.4.8 కోట్లు,మురమళ్ల-ఐ.పోలవరం-ఎదుర్లంక రోడ్డుకు రూ.60 లక్షలు, ముమ్మిడివరం- ఐనాపురం-కాట్రేనికోన రోడ్డుకు రూ.3.9 కోట్లు, ముమ్మిడివరం-ముక్తేశ్వరం రోడ్డుకు రూ.2.15కోట్లు మంజూరయ్యాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం-బొమ్మూరు-కేశవరం రోడ్డు అభివృద్ధికి రూ.3.50కోట్లకు మంజూరు చేశారు. జిల్లా రహదారుల్లో కడియం-జేగురుపాడు, కడియపులంక-పొట్టిలంక-వీరవరం రోడ్లు అభివృద్ధికి రూ.3.20 కోట్లు, కానూరు-గోపవరం, ఎన్‌హెచ్16వీవీ రోడ్డు-ఖండవిల్లి రహదారుల అభివృద్ధికి రూ.4.15 కోట్లు, దువ్వ-తేతలి మునిపల్లె రోడ్డుకు రూ4.15 కోట్లు, గోపాలపురం-కాటకోటేశ్వరం రోడ్డుకు రూ.4.35 కోట్లు, ఎన్‌హై రోడ్డు-కురుకురు-పల్లంట్ల-లక్ష్మీపురం-ఈజీకే రోడ్డుకు రూ.3.50 కోట్లు కేటాయించారు.ఈ నిధులతో వేగంగా రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. పనులకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు.





కొవ్వూరులో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే ముప్పిడి.. విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ చేస్తున్న మంత్రులు సవిత, నిమ్మల, సుభాష్, ఎమ్మెల్యే వాసు తదితరులు

34 శాతానికి బీసీ రిజర్వేషన్లు

- 226 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో పావలా వడ్డీకే విద్యారుణాలు ఇచ్చే యోచన కూటమి ప్రభుత్వం చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. రాజమహేంద్రవరం త్యాగరాజ భవన్‌లో ఆదివారం రాత్రి 226 మంది శెట్టిబలిజ పదో తరగతి మెరిట్ విద్యార్థులకు గోద్రేజ్ సంస్థ ఎస్ఆర్ ఫండ్స్ నుంచి స్కాలర్‌షిప్స్ పంపిణీ చేసి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంచబోతున్నారని, బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నారని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే అటుపై ఏ ముఖ్యమంత్రి దానిని మార్చలేదన్నారు. కానీ జగన్ వచ్చి 24 శాతానికి తగ్గించడం వల్ల ఆ ఐదేళ్లు 16 వేల మంది బీసీలు అవకాశాలు కోల్పోయారన్నారు. కొంతమంది కండువాలు మార్చిన వారు మా పార్టీలోకి వచ్చారని తులసివనంలో గంజాయి మొక్కలైన వారిని ఎట్టిపరిస్థితుల్లో సీఎం చంద్రబాబు ఉపేక్షించరని చెప్పారు.కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గతంలో జగన్ కార్పొరేషన్లు పెట్టి వారి నాయకులకు జీతాలు ఇచ్చుకున్నారు తప్పితే వాటికి నిధులు కేటాయించడం గీత కులాలకు న్యాయం చేయడం వంటివి చేయలేదన్నారు. మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తుందన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ శెట్టిబలిజ విద్యార్థుల మెరిట్ స్కాలర్‌షిప్స్ గోద్రేజ్ సీఎస్ఆర్ ఫండ్స్‌ను ఇప్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రులు,వివిధ కమిటీల చైర్మన్లను శెట్టిబలిజ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. తొలుత వేదికపై జ్యోతిరావు పూలే, దొమ్మేటి వెంకట రెడ్డి తదితర మహనీయులు చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతలక్ష్మి, వడ్డె కార్పొరేషన్ చైర్మన్ వెంకటలక్ష్మి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, కడియాల వీరభద్రరావు, బుడ్డిగ రాధా, కడలి రామకృష్ణ పాల్గొన్నారు.



పిల్లలైన.. పెద్దలు!

పెద్దలు పిల్లలైపోయారు.. కాసేపు తమ బాల్యంలోకి వెళ్లిపోయారు.. ఏరా ఎలాగున్నావ్.. ఏమేవ్ బాగున్నావా అంటూ ఒకరినొకరు పలకరించుకున్నారు.. నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు.. 1973లో కొవ్వూరు గవర్నమెంటు హైస్కూల్‌లో 10 తరగతి, 1973-75 సంవత్సరంలో కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల తరువాత కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో ఆదివారం కలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు.. - కొవ్వూరు



ఉమాచోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన


బిల్వార్చన నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని పాతవూరులో వేంచేసి యున్న ఉమాచోడేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు కౌతవరపు భాను, దేవరకొండ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో దర్బా అప్పల నరసింహమూర్తి, శ్యామల దంపతులు పీఠాలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా గణపతిపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, స్వామివారికి సహస్ర బిల్వార్చన, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో తెన్నేటి సూర్యనారాయణ, పమ్మి రవిబాబు, ముష్టి శ్రీరామచంద్రమూర్తి బవలి దుర్గాప్రసాద్, ప్రభ సుబ్రహ్మణ్యశర్మ, కలిగొట్ల కృష్ణారావు, పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నాగేంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం


సింగరాజుపాలెంలో సాయాన్ని అందిస్తున్న సువర్ణరాజు

నల్లజర్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సింగరాజుపాలెంకి చెందిన కోడేల్లి నాగేంద్రకు ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో ఆ కుటుంబానికి ఆసరాగా నిలబడాలనే ఉద్దేశంతో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు దొండపాటి బాబు ఆధ్వర్యంలో జనసైనికులంతా ఒక్కటయ్యారు. గ్రామ జనసైనికుల సహకారంతో రెండు బస్తాల బియ్యం, రూ. 15 వేలు నగదును గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు చేతుల మీదుగా ఆదివారం వాటిని అందించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చేడసాని బాపిరాజు, గ్రామ సర్పంచ్ గద్దె తిలక్, మండల కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, చీపురు గూడెం పార్టీ అధ్యక్షులు గుండాబత్తుల వరుణ్‌కుమార్, దొండపాటి సతీష్, దొండపాటి శ్రీను, కోమలి వెంకన్న, ప్రత్తి దత్తాత్రేయ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బషీర్


షేక్ బషీర్

నిడదవోలు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణ యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా షేక్ బషీర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బాబీ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.భద్రందొర, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

సూరి చిత్రానికి క్లాప్ కొట్టిన బీజేపీ నేత కేశవ


క్లాప్ కొడుతున్న బీజేపీ నేత కేశవ, ఇతరులు

కొవ్వూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీపవనపుత్ర క్రియేషన్స్ బ్యానర్ పతాకంపై డైరెక్టర్ సురేష్ కొల్లాపు నిర్మిస్తున్న సూరి చిత్రానికి బీజేపీ రాష్ట్ర నేత గెల్లా కేశవ ఫస్ట్ క్లాప్ కొట్టారు. ఈ చిత్రంలో హీరో రామ్ మజ్జి, హీరోయిన్ పూజ, మెయిన్‌లీడ్ గల్లా రాజేష్, సునీల్ కోడూరి, సుమశ్రీ నటిస్తున్నారు. డ్రాప్ వినయ్ తన్నేటి, ప్రొడక్షన్ డిజైనర్ ముప్పిడి ఆశోక్, నరేంద్ర ఏనుగుబల్లి, ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కేశవ మాట్లాడుతూ ఈ చిత్రం సభ్య సమాజానికి మంచి సందేశాన్ని అం దిస్తుందన్నారు. డైరెక్టర్ సురేష్ మాట్లాడుతూ సూరి కథ అన్నివర్గాలను ఆక ట్టుకుంటుందన్నారు. 45 రోజుల్లో చిత్రాన్ని ప్రజల ముం దుకు తీసుకువస్తామన్నారు.

100 మందికి కళ్లద్దాల పంపిణీ

చాగల్లు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర అన్నారు. ఇటీవల సొసైటీ ఆవరణలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 100 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారికి సొసైటీ అధ్యక్షుడు చేతులమీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

● బీసీ సంక్షేమశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత


వాడపల్లి బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న మంత్రి సవిత, పక్కన ఇతర నేతలు

కొవ్వూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు పెద్దపీట వేసేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని బీసీ సంక్షేమశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత అన్నారు. ఆదివారం వాడపల్లిలోని మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వానికి కృతజ్ఞత చూపాలన్నారు. అలాగే తమ పిల్లలను చూడడానికి వచ్చినప్పుడు వసతి, సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లితండ్రులు మంత్రిని కోరారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అసెంబ్లీలో బీసీ బాలుర గురుకుల పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని, బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి ఆధ్వర్యంలో గురుకులాల్లో ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, విద్యార్థులకు అవసరమైన వసతులు ఏర్పాటుచేశామన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరిక మేరకు బీసీ గురుకుల పాఠశాలకు కొత్త భవనం మంజూరు చేస్తామన్నారు. ప్రతి జిల్లాలో బీసీ భవనాల నిర్మాణం చేపట్టాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. సూపర్‌సిక్స్ సూపర్ హిట్ సక్సెస్‌ఫుల్‌గా చేశాం. మెగా డీఎస్సీలో కూడా బీసీలే ఎక్కువగా ఉన్నారన్నారు. బీసీలకు పెద్దపీట వేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. యువగళం అధినేత లోకేష్ ఆధ్వర్యంలో గురుకులాలు, వసతిగృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందించడంతో విద్యార్థులు సంపూర్ణంగా భోజనం చేస్తున్నారన్నారు. సీఎం దృష్టికి తీసుకువెళ్లి సొంత భవనాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గతంలో చేసింది మనమే, భవిష్యత్‌లో చేయబోయేదీ మనమేనన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీ శాఖ మంత్రిగా సవిత రాష్ట్రంలో బీసీల సమస్యలపై అసెంబ్లీలో అనర్గలంగా వాణి వినిపించి రికార్డు సృష్టించారన్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర పాఠశాలకు 5 ఎకరాల స్థలం కేటాయించి, శాశ్వత భవన నిర్మాణం చేపట్టాని, అలాగే బీసీ బాలికల గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని, కొవ్వూరు పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న బీసీ హాస్టల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, బీసీ ప్రాంతాల్లో బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టాలని, బీసీ సబ్‌ప్లాన్ నిధులతో బీసీ ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. బీసీ హాస్టల్స్‌ని రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్పుచేసినట్టయితే విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందుతుందన్నారు. గురుకుల పాఠశాలల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, అర్జిల్లి రామకృష్ణ, జనసేన నాయకులు ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్ (బాబ్జీ), గంటా కృష్ణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాస్, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి బీ.శశాంక, తదితరులు పాల్గొన్నారు. అలాగే పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత అన్నారు. ఆదివారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి నుంచి చాగల్లు, తాళ్లపూడి మండలాలకు చెందిన 10 మందికి మంజూరైన రూ. 4,50,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి సవిత, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీవో రాణీసుస్మిత, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, అర్జిల్లి రామకృష్ణ, జనసేన నేతలు ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్ (బాబ్జి), గంటా కృష్ణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో భారీ అన్నసమారాధన

చాగల్లు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో వేడుకగా ముగిశాయి. ఈసందర్భంగా చాగల్లు గ్రామదేవత పాటెమ్మవారి పాత ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాల్లో యువత పాల్గొనడం అభినందనీయమన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పాటెమ్మపేట పుడింగొయ్యి వద్ద ఏర్పాటు చేసిన బాల కనకదుర్గమ్మ వారి మండపం వద్ద ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్నసమారాధన జరిగింది. శెట్టిబలిజ సంఘం యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఆగర్తి



పెరవలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పీఎంపీల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పెరవలికి చెందిన ఆగర్తి సూర్య వెంకట కృష్ణారావు ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా సంఘ సమావేశం జరిగిందని, దీనికి రాష్ట్ర అధ్యక్షుడు శివరామ కృష్ణ, కార్యదర్శి సురేష్, కోటేశ్వరరావు హాజరయ్యారన్నారు. ఈసందర్భంగా తనను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ పరీక్షలు


నిడదవోలులో షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 75 మందికి పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు పైడి సురేష్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి షుగర్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు జీవీ సత్యనారాయణ, నీరుకొండ సుబ్రహ్మణ్యం, బీఎస్‌వీ ప్రసాద్, మాచర్ల మధుసూధనరావు , తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు ఇత్తడి తులాభారం కాటా బహూకరణ


తిమ్మరాజుపాలెంలో అమ్మవారికి ఇత్తడి కాటా అందజేసిన భక్తులు, ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు

నిడదవోలు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ వారికి విజయవాడకు చెందిన బొగ్గరపు రాంబాబు, అనురాధ దంపతులు వారి కుమారులు వెంకట ఉదయ్,కైలాస్ సుమారు రూ. 1.20 లక్షల విలువ చేసే ఇత్తడి తులాభారం కాటాను ఆదివారం బహూకరించారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వీహెచ్‌ఎస్ ప్రకాశ్, ఆలయ ప్రధాన అర్చకులు ఎస్‌వీకేపీ శర్మ పాల్గొన్నారు. అలాగే అమ్మ వారి హుండీని ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు లెక్కించారు. హుండీ, టికెట్లు ద్వారా రూ.1,71,119 వచ్చినట్టు ఈవో తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో సీసీ కెమెరాలు : మంత్రి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

రాజమహేంద్రవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హాస్టళ్లను మెరుగు పరిచే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నాం. ప్రతీ వసతి గృహం, గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల బీసీ సంక్షేమ, చేనేత, జౌళి, లేపాక్షి శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. బీసీ వసతి గృహాల పరిస్థితిపై ఆరాతీశారు. సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ నిధులతో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. దోమలు రాకుండా మెస్‌లను ఉంచాలని, వేడి చేసి చల్లార్చిన నీరు, తాజాగా వండిన ఆహారం మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. విశ్రాంతి, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడుకోవడానికి కాయిన్ ఫోన్ సౌకర్యం కల్పించాలని ఆమె సూచించారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు సక్రమంగా ఉండాలని, వసతి గృహాల్లోని విద్యార్థులను అధి కారులు తమ పిల్లలుగా భావించి బాధ్యతగా చూడాలన్నారు.

ఆప్కో, లేపాక్షి విక్రయాల పెంపు

ఆప్కో, లేపాక్షి విక్రయాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని.. ఇప్పటికే మార్కెట్‌లో ఆప్కో రెడీమేడ్ వస్త్రాలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. మేక్ ఇండియా - మేడ్ ఇండియా దిశగా స్వదేశీ వస్తువులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అలవాటు చేయాలన్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పథకాల అమలు మరింత వేగవంతం కావాల్సి ఉందని చెప్పారు. ఈ ప్రాంతాల్లో 16 ఆప్కో షాపులు నిర్వ హిస్తున్నామన్నారు. సమావేశంలో ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆంధ్రప్రదేశ్ బీసీ కో ఆపరేటివ్‌గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకటగురు మూర్తి, ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఆప్కో జీఎం కె.పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సాయం


త్యాజంపూడిలో సాయాన్ని అందజేసిన జనసేన నాయకులు

దేవరపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో జనసేన పార్టీ ముందుంటుందని త్యాజంపూడి ఎంపీటీసీ కాళ్ల వెంకటరత్నం, గ్రామ జనసేన అధ్యక్షుడు దావాల శ్రీను, జనసేన సీనియర్ నేత దాసరి శేషరావు పేర్కొన్నారు. త్యాజంపూడికి చెందిన జనసేన కార్యకర్త కొత్తపల్లి ఏడుకొండలు తాపీ పనిచేస్తూ ప్రమాదవశాత్తు పడిపోవడంతో కాలు విరిగిపోయింది. దీంతో జనసేన నేతలంతా కలిసి ఏడుకొండలకు రూ.17వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు కాళ్ల బులిరాజు, కోనా నాగు, బళ్లా అయ్యప్ప, గంజి అశోక్, కొత్తపల్లి శ్రీనివాస్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దేశ భక్తిని పెంపొందించడమే ఆర్‌ఎస్ఎస్ లక్ష్యం

● బీజేపీ జిల్లా నేత సింహాద్రి సత్యనారాయణ


ఆర్ఎస్ఎస్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పెరవలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశభక్తి, సేవాభావం పెంపొందించడమే ఆర్ఎస్ఎస్ ప్రధాన ఉద్దేశమని జిల్లా బీజేపీ నేత సింహాద్రి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ఆదివారం సాయంత్రం కానూరు రామకృష్ణ సేవా మందిరంలో సమావేశం జరిగింది. 1925లో మహారాష్ట్రలోని నాగపూర్‌లో డాక్టర్ కేశవ బాలిరామ్ హేగ్డేవార్ దీన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఓలేటి నారాయణ కుమార్, రంగినీడి గంగాధరరావు, కరుటూరి సుబ్బారావు, కోడూరి రమణ మూర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు..


ఉత్సవమూర్తులకు మహాస్నపనము దృశ్యం

● వాడపల్లి వెంకన్న సన్నిధిలో మహాసుదర్శన హోమం
● వైభవంగా తోమాల సేవ
● ఆకట్టుకున్న ప్రదర్శనలు


హనుమత్ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

ఆత్రేయపురం, అక్టోబరు 12 (ఆంధ్ర జ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఆది వారం బ్రహ్మాండగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొని తరించారు. ఉద యం స్వామివారిని వసంత మండపంలో సర్వాం గ సుందరంగా అలంకరించిన వేదిక వద్దకు తోడ్కొని వచ్చి వైఖానస శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపడింతులు, అర్చకులు బ్రహ్మోత్సవ పూజలను నిర్వహించారు. ఉదయం 9.10 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, మహాస్నపనము, హోమములు, దుష్టగ్రహ పరిహారార్థం మహాసుదర్శన హోమం, వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. అనంతరం మేళతాళ మంగవాయిద్యాలతో తోమాల ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనం తరం స్వామివారికి సమర్పించి తోమాల సేవను నిర్వహించారు. కేరళవాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వస్తివచనం ప్రధాన హోమములు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దంపతులు పాల్గొన్నారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్‌శోభగుల నడుమ శ్రీవారు కోదండరామ అలంకరణలో అలంకృతుడై హనుమత్‌వాహనం పై తిరువీధుల్లో వివిధ కళాకారుల ప్రదర్శనల నడుమ విహరించి కృపా కటాక్షాలు అందించారు.

నాల్గోరోజు...

వాడపల్లిలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు సోమవారం యోగ నారసింహ అలంకరణలో శ్రీవారి సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.


మహిళా కళాకారుల వాయిద్య ప్రదర్శన

బాణసంచా పేలుడు ఘటనలో పదికి చేరిన మృతుల సంఖ్య

చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి
తమకు న్యాయం చేయాలంటూ అనపర్తిలో బంధువుల ఆందోళన


యామిని (ఫైల్)


వెంకటకృష్ణ (ఫైల్)

అనపర్తి/ రాయవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం విసావరం గ్రామ పరిధిలో గణపతి ఫైర్ వర్క్స్‌లో ఈనెల 8న జరిగిన అగ్ని ప్రమాదంలో ఆదివారం నాటికి మృతుల సంఖ్య పదికి చేరుకుంది. సంఘటనలో ఆరుగురు సజీవ దహనం కాగా మరో నలుగురు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా అదే రోజు ఒకరు, మరుసటి రోజు ఒకరు, ఆదివారం మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన రోజు యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ, పాకా అరుణ, చిట్టూరి శ్యామల, పెంకే శేషారత్నం, కురుపూడి జ్యోతి, కె.సదానంద్ సజీవదహనం కాగా అదే రోజు ఆసుపత్రిలో పొట్నూరి వెంకటరమణ మృతి చెందగా మరుసటి రోజు వాసంశెట్టి విజయలక్ష్మి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం చిట్టూరి యామిని (30), లింగం వెంకటకృష్ణ(22) చికిత్స పొందుతూ మృతిచెందారు. కాకినాడలో జీజీహెచ్‌లో అనపర్తికి చెందిన చిట్టూరి యామిని మృతి చెందడంతో పోస్టుమార్టం అనంతరం అధికారులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని అనపర్తికి తరలించారు. అయితే యామిని బంధువులు మృతదేహాన్ని కొమరిపాలెంలోని యజమాని ఇంటికి తరలించే ఆలోచన చేయడంతో పోలీసులు అంబులెన్సను రెండు జీపులతో వెంబడించారు. బలభద్రపురం వంతెన వద్ద కొమరిపాలెం వైపు అంబులెన్సను మలుపు తిప్పే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు మృతదేహాన్ని అనపర్తిలోని యామిని ఇంటికి చేర్చారు. అంబులెన్స్ నుంచి మృతదేహాన్ని దించేది లేదంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి యామిని ఇంటికి అధి కారులను పంపించడమే కాకుండా ఫోన్‌లో యా మిని భర్త శ్రీనుతో మాట్లాడారు. ఇప్పటికే విచారణ కోసం కమిటీని నియమించడం జరిగిందని, 2,3 రోజుల్లో అక్స్‌గ్రేషియా ప్రకటన వెలువడుతుందని ఆందోళన చెందవద్దంటూ వివరించారు. యజమాని కుమారుడు చిట్టిబాబు కూడా శ్రీనుతో మాట్లాడటంతో మృతుల బంధువులు శాంతించారు. మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పెదపూడి మండలం వేంద్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ(22) ఆదివారం మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

కొత్తపల్లిలో దంత పరీక్షలు


కొత్తపల్లిలో ఇంటింటికీ తిరిగి దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పెరవలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భీమవరం విష్ణు డెంటల్ కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం షైన్స్‌ఫర్ స్మైల్స్ అనే ప్రజాహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్తపల్లిలో వైద్యబృందం ఇంటింటికి వెళ్లి గ్రామస్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. నోటి ఆరోగ్యం ప్రాముఖ్యత, నోటి వ్యాధుల నివారణ గురించి అవగాహన కల్పించారు. మెరుగైన వైద్యసేవలు పొందేందుకు పెరవలిలో ఏర్పాటు చేసిన బ్రాంచికి రావచ్చునని తెలిపారు.

గవాయ్‌పై దాడిని ఖండిస్తున్నాం

గోపాలపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజే బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంఆర్‌పీఎస్ నేతలు ప్రకటించారు. ఈ మేరకు వారు ఆదివారం పెద్దగూడెంలోని బాబూజగ్జీవన్ రామ్‌నగర్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు కవులూరి సురేష్ మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవానికి, అస్తిత్వాన్నికి ఏ రూపంలో ప్రమాదం వచ్చినా దానిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాలను చైతన్యం చేస్తున్నట్టు చెప్పారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు సిర్రా కృష్ణ, తానేటి రాఘవులు, తానేటి స్టీఫెన్, కొడవటి చిన వెంకటేశ్వరరావు, కవులూరి ప్రసాద్, చాపల రవి, తానేటి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు మండల ఎంఆర్‌పీఎస్ నేత సిర్రా కృష్ణమాదిగ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు జడ్జి ఒంటరి కాదని, ఆయన వెనుక దళితులు, పీడిత వర్గాల శక్తులు ఉన్నాయనే సంకేతాన్ని చాటి చెప్పాలన్నారు.